మానవాళికి ఆదర్శప్రాయుడు బుద్ధుడు

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

స్థల దాతలను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్, మే 12: మానవాళికి ఆదర్శప్రాయుడు బుద్ధుడు అని, ఆయన సూచించిన అష్టాంగ మార్గాల ద్వారా ప్రజలకు ఆధ్మాత్మిక జ్ఞానం లభిస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొమటిబండలోని పిరమిడ్ ట్రస్టు ఆధ్వర్యంలో బుద్ధుడి విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ఘనంగా వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి యోగాసనాలు, ధాన్యం దివ్యౌషధంగా పనిచేస్తాయన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు యోగాసనాలు అలవాటు చేసుకోవాలన్నారు. కరోనా తర్వాత ఆరోగ్యంపై అందరిలో అవగాహన వచ్చిందని, అందుకు పిరమిడ్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొని ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఆసనాలు నేర్చుకోవాలన్నారు. అనం తరం ట్రస్టు నిర్వహణ కోసం స్థలం ఇచ్చిన కర్కాల కుటుంబ సభ్యులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యు లు నర్సింహులు, బాల్‌రెడ్డి, రాజిరెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సేంద్రియ ఎరువులు వాడాలి

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి, మే 12: పంట దిగుబడుల కోసం సేంద్రియ ఎరువులు వాడాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రైతులకు సూచించారు. సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లిలో ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రైతులకు వ్యవసాయ రంగంలో సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో కొనుగోలు చేసే వివిధ రకాల విత్తనాలకు వ్యాపారుల వద్ద రసీదులు పొందాలన్నారు. వరితో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో సత్యన్వేశ్, ఏఈవోలు లోహిత్, సాయికుమార్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి ఆలయ కమిటీని ప్రకటించాలి

పూజలు చేస్తున్న అయిలేని మల్లికార్జున్‌రెడ్డి

హుస్నాబాద్‌టౌన్, మే 12: హుస్నాబాద్ ఎల్లమ్మ దేవస్థానానికి తాత్కాలిక కమిటీ కాకుండా ప్రభుత్వం పూర్తిస్థాయి కమిటీ ప్రకటించాలని బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. రేణుకా ఎల్లమ్మను సోమవారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయానికి పూర్తిస్థాయి ఈవో, కమిటీని తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు మేకల వికాస్‌యాదవ్, అరవింద్, జెరిపోతుల లక్ష్మణ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

నేడు పాలిసెట్

గజ్వేల్, మే 12: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం మంగళవారం (నేడు) ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు పాలిసెట్ నిర్వహిస్తామని గజ్వేల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారావు సోమవారం ప్రకటనలో తెలిపారు. గజ్వేల్‌లోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో పరీక్ష నిర్వహణకు ఏర్పాటు పూర్తి చేసినట్లు తెలిపారు. బాలుర ప్రాంగణంలోని పాలిటెక్నిక్ కళాశాల, జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, 1195 మంది పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. గంట ముందుగానే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని, అభ్యర్థులు హాల్‌టికెట్, బ్లూ లేదా నలుపు పెన్ను, హెచ్‌బీ పెన్సిల్ తీసుకుని రావాలని ఆయన సూచించారు.

విద్యార్థులకు సన్మానం

మద్దూరు(ధూళిమిట్ట), మే 12: మద్దూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన తస్మియా, ఐశ్వర్య, అశ్విని, రిషిక, శివానిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు సోమవారం సన్మానించారు. ఈసందర్భంగా హెచ్ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడం సంతోషంగా ఉందన్నారు. మండల స్థాయిలో విద్యార్థులు అధిక మార్కులు సాధించినట్లు తెలిపారు. పాఠశాలలో ఉత్తమ ఫలితాలు వచ్చేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను ఆయన ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంఠారెడ్డి జనార్దన్‌రెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ హేమలత, సీఏ జేబా తపస్సుమ్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దామెర మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

భూ నిర్వాసితులకు ఇండ్లు మంజూరు చేయాలి

హుస్నాబాద్‌రూరల్, మే 12: అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితులకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి సోమవారం హైదరాబాద్‌లో భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణంలో 931 కుటుంబాలు ముంపునకు గురయ్యాయని, వారు వ్యవసాయ భూములు కోల్పోవడంతో పాటు నివసించేందుకు ఇండ్లు కూడా లేవని వినతి పత్రంలో పేర్కొన్నారు. ముంపునకు గురైన గుడాటిపల్లి గ్రామస్తులు పెట్టుకున్న అర్జీని సత్వరమే పరిష్కరించాలని కోరారు. ముంపు బాధితులకు త్వరగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి వారికి న్యాయం చేయాలని కోరగా, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు చాడ తెలిపారు.

చట్టాలపై ఉపాధి కూలీలకు అవగాహన

ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న షీటీమ్ సభ్యులు

మద్దూరు(ధూళిమిట్ట), మే 12: మద్దూరు మండలం లద్నూర్‌లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీలకు మహిళల చట్టాలు, సైబర్ నేరాలు, సోషల్ మీడియా, అపరిచిత వ్యక్తులపై హుస్నాబాద్ షీటీమ్ సభ్యులు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వాట్సాప్‌కు వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఇతరులకు బ్యాంక్ ఖాతా వివరాలు చెప్పవద్దన్నారు. సైబర్ నేరం జరిగినట్లు గుర్తిస్తే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో షీటీమ్ హెడ్ కానిస్టేబుల్ సదయ్య, మహిళా కానిస్టేబుళ్లు ప్రశాంతి, స్వప్న, కానిస్టేబుల్ కృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ ఫలితాలు

రాయపోల్,మే12: ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని దౌల్తాబాద్ ఎంఈవో కనకరాజు అన్నారు. సోమవారం మండల వనరుల కేంద్రంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య లభిస్తుందనే విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, అప్జల్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచేలా కృషిచేయాలి

- అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

సిద్దిపేట, మే 12: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచేలా కృషి చేయాలని అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, ఆయా శాఖల వెల్ఫేర్ అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంటర్ ఫలితాల్లో ఆయా కళాశాలల వారీగా ఎదురైన సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై ఏకాగ్రత పెట్టేవిధంగా ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు చర్యలు తీసుకోవాలన్నారు. చేర్యాల, దుబ్బాక, మిరుదొడ్డి, కోహెడ మండలాల్లోని ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులు చేరుతారని, ఎక్కువ అడ్మిషన్లు వచ్చే గ్రామాలను గుర్తించి బస్సు సౌకర్యం కోసం ఆర్టీసీ మెదక్, కరీంనగర్, జనగాం రీజినల్ మేనేజర్లతో మాట్లాడాలని అధికారులకు సూచించారు. బస్సు సౌకర్యం కల్పిస్తే ఎక్కువ మంది విద్యార్థులు కళాశాలలకు వచ్చే అవకాశం ఉందన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి అన్ని కళాశాలల్లో బయోమెట్రిక్ అమలు చేస్తామన్నారు. అన్ని హాస్టళ్లలో విద్యార్థులు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఐఈవో రవీందర్‌రెడ్డి, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, డీబీసీడీవో నాగరాజమ్మ, డీఎండబ్ల్యూవోఎస్‌కే అహ్మద్, డీఎస్సీడీవో కవిత, కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

అర్జీలు వేగంగా పరిష్కరించాలి

- కలెక్టర్ మనుచౌదరి

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట, మే 12: ప్రజావాణిలో వచ్చే అర్జీలకు ప్రాధాన్యం ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్‌తో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ.. సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వస్తారన్నారు. ఆయా శాఖల వారీగా అధికారులు స్వీకరించిన ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా పరిశీలించాలని సూచించారు. ప్రజావాణికి వచ్చిన మొత్తం 49 ఫిర్యాదులను వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరించే విధంగా తగుచర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో నాగరాజమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

మద్దూరు(ధూళిమిట్ట), మే 12: కేంద్రంలోని మోదీ సర్కారు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ కోరారు. సోమవారం మద్దూరు మండలం నర్సాయపల్లికి చెందిన 30 మంది నాయకులు ఏఐటీయూసీ, సీపీఐలో చేరారు. అనంతరం సీపీఐ గ్రామ శాఖ రెండో మహాసభ సీపీఐ మండల కార్యదర్శి జంగిలి యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఐ సమరశీల పోరాటాలు చేస్తుందన్నారు. సీపీఐ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు ఈరి భూమయ్య, నాయకులు కనకయ్య, నంగి సత్తయ్య, రాజు, అనిల్, రమేశ్ పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యపెంచాలి

మాట్లాడుతున్న ఎంఈవో మాధవరెడ్డి

జగదేవపూర్, మే 12: సర్కారు బడుల్లో విద్యార్థుల నమోదు సంఖ్య పెంచాలని ఎంఈవో మాధవరెడ్డి, జగదేవపూర్ కాంప్లెక్స్ హెచ్ఎం సైదులు సూచించారు. సోమవారం జగదేవపూర్ బాలికల పాఠశాలలో నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడారు. బడిబాటలో భాగంగా ఇంటింటికీ తిరుగుతు విద్యార్థులను సర్కారు బడుల్లో చేర్పించేలా తల్లిదండులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు శ్రీనివాస్, మాధవరెడ్డి, అనసూయ, నరేందర్, సరోజ, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు నేతిశంకర్, గోపికళ, సత్యం, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అభిరుచి పెంచేలా బోధన అభినందనీయం

సాదత్‌అలీని సన్మానిస్తున్న ఎంఈవో

జగదేవపూర్, మే 12: విద్యార్థుల్లో శాస్త్రీయ అభిరుచి పెంచేలా బోధన చేయడం అభినందనీయమని మండల విద్యాధికారి మాధవరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వట్టిపల్లి పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు సాదత్‌అలీ సింపుల్ టాస్క్ గ్రేట్ కాన్సెప్ట్ విధానంలో దాదాపు 60 ప్రయోగ కృత్యాలను విద్యార్థులచే చేయించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలరాజు, ఉపాధ్యాయులు మల్లయ్య శ్రీనివాస్, రాజు, ఏఏపీసీ చైర్‌పర్సన్ భవాని, వెంకట్‌రాంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పనులను ప్రారంభిస్తున్న తహసీల్దార్

మద్దూరు(ధూళిమిట్ట), మే 12: ధూళిమిట్ట మండలం రెడ్యానాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని డీఎన్టీ హైస్కూల్ వరకు చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం తహసీల్దార్ సింహాచలం మధుసూదన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేండ్లుగా పాఠశాలకు దారి లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారన్నారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గ్రామస్తుల సహకారంతో దారి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

చౌదరిపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

దుబ్బాక, మే 12: దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట-భూంపల్లి మండలం చౌదర్‌పల్లి దుబ్బరాజేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో మూడు రోజులుగా ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం శివనామస్మరణతో మార్మోగింది.

వేణుగోపాలస్వామి కల్యాణం

తొగుట,మే 12: మండలంలోని వెంకట్రావుపేటలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో రాయరావు అరుణ-రఘుపతి రావు ఆలయ భక్తమండలి ఆధ్వర్యంలో సోమవారం వేణుగోపాలస్వామి కల్యాణం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు జీడికంటి రాజుఆచార్యుల ఆధ్వర్యంలో రుత్విక్‌లు ఉదయం హోమం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హాజరుకాగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి సన్మానించారు. తొగుట సీఐ లతీఫ్,ఎస్సై రవికాంత్‌రావు, ఏఎస్సై రాంరెడ్డి హాజరుకాగా వారిని అర్చకులు సన్మానించారు. సాయంత్రం అమ్మవార్ల ఊరేంగింపులో భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను సన్మానిస్తున్న దృశ్యం

ప్రారంభమైన రేణుకా ఎల్లమ్మ జాతర

రేణుకా ఎల్లమ్మతల్లికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దంపతులు

హుస్నాబాద్‌టౌన్, మే 12: హుస్నాబాద్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ జాతర సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం ఘటం కుండను ఎల్లమ్మ ఆలయానికి తీసుకురాగా, మున్సిపల్ కార్యాలయం నుంచి పట్టువస్త్రాలను బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దంపతులు తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం మొదటిసారిగా ఆలయ మండపంలో అమ్మవారి కల్యాణాన్ని వైభవంగా వేద పండితులు నిర్వహించారు. కల్యాణం చూసేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలిరావడంతో ఆలయం నిండిపోయింది. కార్యక్రమం పూర్తి కాగానే బైండ్లపూజారులు తల్లిఎల్లమ్మ.. మా తల్లి ఎల్లమ్మ అంటూ కథను చెప్పడంతో శివసత్తులు ఊగిపోయారు. ఒకవైపు కల్యాణం, సిద్దోగం జరుగుతుండగా భక్తులు సైతం అమ్మవారి దర్శనం కోసం పెద్దఎత్తున తరలివచ్చి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఎడ్లబండ్లు, వివిధ వాహనాలను ఆలయం చుట్టూ తిప్పే కార్యక్రమంతో పాటు గావుపట్టే కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా సాగింది.

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

కాకతీయుల కాలం నుంచి సర్వాయి పాపన్న చేతుల మీదుగా పునర్నిర్మాణం జరిగిన హుస్నాబాద్ రేణుకాఎల్లమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ కోరారు. కల్యాణం, సిద్దోగంలో పాల్గొని ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మినీట్యాంక్, దుకాణాల సముదాయాన్ని, వీనెట్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంత్రి ప్రారంభించారు. మంత్రి పొన్నం, కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ బైండ్ల పూజారులతో కలిసి నృత్యం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, హుస్నాబాద్ ఆర్డీవో రామమూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, ఆలయ ఈవో కిషన్‌రావు, మాజీ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు రాధ, నర్సాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్ గౌడ్, భగనావన్, రమాదేవి పాల్గొన్నారు.

16నుంచి గౌరీ నీలకంఠేశ్వర ఆలయ వార్షికోత్సవాలు

మాట్లాడుతున్న నీలకంఠ సమాజం నాయకులు

సిద్దిపేట, మే 12: సిద్దిపేట పట్టణంలోని గౌరీ నీలకంఠేశ్వర ఆలయ 34వ వార్షికోత్సవాలు ఈనెల 16 నుంచి నిర్వహించనున్నట్లు నీలకంఠ సమాజం అధ్యక్షుడు గుండ్ల యోగేశ్వర్, ప్రధాన కార్యదర్శి సురేశ్ తెలిపారు. సోమవారం సిద్దిపేట గౌరీ నీలకంఠేశ్వర ఆలయంలో నీలకంఠ సమాజం నాయకులతో కలిసి వారు మాట్లాడారు. ఈనెల 16న గణపతి పూజతో ప్రారంభమయ్యే వార్షికోత్సవాలు ఆదివారం గౌరీ నీలకంఠేశ్వరస్వామి కల్యాణంతో ముగుస్తాయన్నారు. సిద్దిపేట పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు పెద్దఎత్తున హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. సమావేశంలో నీలకంఠ సమాజం నాయకులు నర్సింహులు, జనార్దన్, రాజు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

కేక్ కట్‌చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

సిద్దిపేట, మే 12: ప్రపంచ మొట్టమొదటి నర్సు ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజును అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా జరుపుకొంటామని సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ కేటీషిబా తెలిపారు. సోమవారం సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మొట్టమొదటి నర్సు ఫ్లారెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విజయకుమారి, ఏవో సురేందర్, సూపరింటెండెంట్ రామ్ దామోదర్ పాల్గొన్నారు.

అ పూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కోహెడ, మే 12: మండలంలోని వింజపల్లి ఉన్నత పాఠశాలలో 2004-05 విద్యా సంవత్సరంలో టెన్త్ పూర్తిచేసిన విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఉపాధ్యాయులను సన్మానించారు. 21 ఏండ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని వారు తెలిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి సంతోషంగా గడిపారు.

ఇసుక డంపు స్వాధీనం

ఇసుకడంపు వద్ద మద్దూరు పోలీసులు

మద్దూరు(ధూళిమిట్ట), మే 12: ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లిలో ఎర్ర బచ్చల మల్లేశం అక్రమంగా అదే గ్రామానికి చెందిన వంటేరు రాజిరెడ్డికి చెందిన ఖాళీ స్థలంలో నిల్వ చేసిన ఏడు ట్రాక్టర్ల ఇసుక డంపును సోమవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకుని మద్దూరు పోలీసులకు అప్పగించారు. ధూళిమిట్ట తహసీల్దార్ మధుసూదన్ ఫిర్యాదు మేరకు మద్దూరు ఏఎస్సై సదాశివరావు ఘటనా స్థలాన్ని సందర్శించి పంచనామ నిర్వహించి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తుల సమాచారం అందించాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చేర్యాల, మే 12: మండలంలోని వీరన్నపేట గ్రామానికి చెందిన దేవరాజుల రాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ శివశంకర్‌గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. వారికి రూ. 3వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నవగ్రహ విగ్రహాల కోసం విరాళం అందజేత

చేర్యాల, మే12: చేర్యాల మండలంలోని ముస్త్యాల అభయాంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 29 నుంచి నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన జరగనున్నది. ఇందులో భాగంగా నవగ్రహ విగ్రహాల ఏర్పాటు కోసం ఎన్ఆర్ఐ పెడతల సంధ్యాఅమరేందర్‌రెడ్డి దంపతులు రూ. 30వేల విరాళం అందజేశారు. నవగ్రహ విగ్రహాలు ఇప్పించిన అమరేందర్‌రెడ్డి దంపతులను గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

హుస్నాబాద్ ఏసీపీగా సదానందం

సిద్దిపేట సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన ఏసీపీ సదానందం

హుస్నాబాద్‌టౌన్, మే 12: హుస్నాబాద్ ఏసీపీగా సదానందం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, జిల్లా పోలీసు కమిషనర్ అనురాధను మర్యాదపూర్వకంగా కలిశారు. హుస్నాబాద్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతలకు పెద్దపీట వేయాలని, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై పటిష్టమైన నిఘా పెట్టాలని పోలీస్ కమిషనర్ అనురాధ ఏసీపీకి సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని ముందస్తు ప్రణాళికలు తయారుచేసుకోవాలని, రోడ్డు ప్రమాదాలపై తగిన చర్యలు తీసుకుని, దొంగతనాలు జరగకుండా దృష్టి సారించాలన్నారు. అంతకుముందు హుస్నాబాద్ నుంచి హైదరాబాద్‌కు బదిలీ అయిన ఏసీపీ సతీశ్ నూతన ఏసీపీ సదానందానికి బొకే